పూర్తికాని అదనపు గదులు

- ఇబ్బందులకు గురవుతున్న పాఠశాల విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



ఉంద్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ఉంద్యాలలో నిర్మించిన పాఠశాల అదనపు గదులు

చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాల జెడ్పీ హెచ్ పాఠశాల అదనపు గదుల నిర్మాణం పూర్తవ్వ లేదు. విద్యార్థులకు ఇబ్బందులు ఉన్నాయని 2019లో ప్రభుత్వం రూ.50 లక్షల నిధులను అదనపు గదుల నిర్మాణానికి మంజూరు చేసింది. అధికారులు పనులు ప్రారంభించి నిధులు సరిపోలేదన్న సాకుతో మధ్యలో వదిలేశారు. కాగా గతేడాది 'మన ఊరు–మన బడి' ద్వారా అదనంగా నిధులు మంజూరు చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులను పూర్తి చేయలేకపోయారు. గదులు నిర్మించి లోపల సిమెంట్ ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ బండలు, ఎలక్ట్రిషన్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, మూత్రశాలలు, కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు మిగిల్చారు. దీంతో ఆ గదులు ఉపయోగంలోకి రావడం లేదు. గదుల చుట్టూ ముళ్లపొదలు ఏపుగా పెరిగి పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది.

500 మంది విద్యార్థులు

ఉంద్యాలలో ఏళ్లుగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలు ఒకే చోట కొనసాగుతున్నాయి. రెండు పాఠశాలలకు కలిపి 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అంత మంది విద్యార్థులకు కేవలం ఏడు గదులు మాత్రమే ఉన్నాయి. ఆ గదులు కూడా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో పెచ్చులు ఊడిపడి విద్యార్థులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతేకాక పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇళ్లకు లేదా రోడ్డుపైకి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు కలగకుండా చూడాలి



పాఠశాలలో విద్యార్థులకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభించి సగంలో వదిలేదు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాలి. – వెంకటేష్‌గౌడ్, ఉంద్యాల

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

ఉంద్యాలలో అదనపు గదులకు స్లాబ్ వరకు పూర్తి చేశాం. ఫ్లోరింగ్ బండలు, ఎలక్ట్రిషన్ పనులు చేపట్టాల్సి ఉంది. గ్రామానికి చెందిన వ్యక్తికే కాంట్రాక్ట్ ఇవ్వడంతో నిర్లక్ష్యంగా వ్యవరించాడు. అందుకు నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చాం. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించి త్వరలోనే పూర్తి చేస్తాం. విద్యార్థులకు గదులు అందుబాటులోకి తెస్తాం. – కురుమూర్తి, ఏఈ పీఆర్, చిన్నచింతకుంట

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్లు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేష్, సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు నర్సింహులు, హెడ్‌మాస్టర్ బాసిత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు రాణించాలని సూచించారు. ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. బెల్టులు పొందిన విద్యార్థులను వారు అభినందించారు. ఫౌండర్ వెంకటేష్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 8 మంది ఎల్లో, ముగ్గురు ఆరెంజ్, ముగ్గురు బ్లూ, ముగ్గురు మెరూన్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ అక్షయ, రామకృష్ణ, బుచ్చన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: సాంఘీక సంక్షేమ గురుకులాల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలో చిట్టిబోయిన్‌పల్లి వద్ద ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్, పోచమ్మగడ్డవద్ద ఉన్న బాలానగర్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ బాలుర పాఠశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రవేశ పరీక్ష ఉదయం 10:30గంటల నుంచి 12:30గంటల వరకు నిర్వహించగా పాఠశాలల వద్ద తల్లిదండ్రుల సందడి కనిపించింది.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశమైన గ్రామస్తులు

గండీడ్: లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఎండోమెంట్ అధికారి ప్రసాద్ తెలిపారు. ఆదివారం జంగంరెడ్డిపల్లిలో గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం ఆలయ భూములు కౌలుకు చేస్తున్న రైతులు కౌలు చెల్లించాలని కోరారు. 22న జరిగే స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పూజారి వెంకటేశ్వరాచార్యులు, హన్మంతు, తిరుపతయ్య, వెంకటేష్, పెంటయ్య, కేశవులు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ విగ్రహం ఏర్పాటుకు డిమాండ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాజధానితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో బీపీ మండల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులకు ఐదు ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థలలో జనాభా ప్రాతిపదికన యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనలో ఉపకులాల వారిగా నమోదు చేయాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 18శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ కింద నగదు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాంతన్న యాదవ్, జుర్రు నారాయణ యాదవ్, భరత్ కుమార్ యాదవ్, బత్తుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యునైటెడ్ ముస్లిం ఆర్గనైజేషన్ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యునైటెడ్ ముస్లిం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక న్యూటౌన్‌లోని బజ్మెకైకషా హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా రాష్ట్రం నిర్లక్ష్యానికి గురైందని, అన్ని వ్యవస్థలు కూడా అస్తవ్యవస్తంగా తయారయ్యాయని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి మూలనపడ్డాయన్నారు. ఇప్పుడు ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రభుత్వం వచ్చిందన్నారు. ఉర్దూ ఘర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో మాట్లాడడం జరిగిందని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గ్రంథాలయంలో ఉర్దూ పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు రూ.లక్ష నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం యునైటెడ్ ముస్లిం ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించిన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రహెమాన్ సోఫి, ఎంఏ.రహెమాన్, హలీం బాబర్, అబ్దుల్ రహెమాన్, యూసుఫ్ బిన్ నాసర్, ఖలీద్ నవీద్, మజీద్, అబ్దుల్ రజాక్, మీర్ షోయబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజల ప్రభుత్వం

ఇది ప్రజల ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కేంద్రంలో లోడింగ్, అన్‌లోడింగ్ హమాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని విధాల మీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గడియారం చౌరస్తా వద్ద హమాలి సంఘం సభ్యుల కోసం షెడ్ నిర్మాణం, ఈ నెలచివరి నాటికి బోరుబావి, అలాగే ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేలా కూలర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టీచర్స్‌కాలనీలోని బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో రెడ్‌క్రాస్ సహకారంతో విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్‌లను ఎమ్మెల్యే ఉచితంగా అందజేశారు.

షాసాబ్‌గుట్ట దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

షాసాబ్‌గుట్టలోగల సయ్యద్ మర్దాన్‌అలీషా దర్గా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్ రజాక్‌షా ఖాద్రీ, మొయిన్ అలీ, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, ముజిబ్, మహ్మద్ ఖాదర్, అఫ్రోజ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

పాలమూరు: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో బీ జేపీ జెండాను ఆదివారం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆవిష్కరించారు. అనంతరం ఎల్.కె అడ్వాణీకి భారతరత్న ప్రకటించిన క్రమంలో స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ముచ్చటగా మూడోసారి మోడీ అనే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కొకుంట్ల మండలం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అప్పంపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయని పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, సుధర్శన్, రా ఘవరెడ్డి, సీతన్న, నాగిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



హన్వాడ: మండల కేంద్రంలోని రైతు మార్కెట్, ఓపెన్ జిమ్ ప్రాంతంలో పండగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఎంపీపీ బాల్‌రాజు భూమి పూజ చేశారు. మండలకేంద్రానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

జడ్చర్ల టౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులకు, సినీనటులకు ఇచ్చే నంది అవార్డు పేరు తొలగించి గద్దర్ అవార్డుగా మార్చటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించాలని కోరారు.

6న పీయూలో జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 6న శ్రీచైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని ఆసక్తి గల వారు ఉదయం 10గంటలకు పీయూ అకాడమిక్ బ్లాక్‌లో హాజరుకావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9849445877 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు



మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ముల లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ హుండీని ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. రూ.20,030 వచ్చినట్లు చైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే నూతన కమిటీని సన్మానించారు, కార్యక్రమంలో శ్రీధర్, మహేష్, నాగేశ్వర్‌గౌడ్, బాల్‌రెడ్డి, మన్యంరెడ్డి, కృష్ణయ్య, బాబా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి అవకాశం ఇవ్వండి

దేవరకద్ర: బీజేపీకి మూడోసారి అవకాశం ఇవ్వాలని పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ వాల్‌రైటింగ్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలవడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, దేవన్న, నాగిరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణంరాజు, సత్యనారాయణ, నరేష్‌చారి, రాజు, శ్రీశైలాచారి తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలని వినతి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సోషల్ ఆడిట్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని సోషల్‌ఆడిట్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగయ్య కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నంశ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులుగా మాదిరిగా తమకు పే స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. పే స్కేల్‌ను అమలు చేయకపోవడంతో తాము చాలా నష్టపోతున్నారు. కార్యక్రమంలో కొండల్‌రవి, రంజిత్‌కుమార్, ప్రసాద్‌కుమార్, శ్రీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



సతీష్

మహమ్మదాబాద్: యువకుడు అదృశ్యమైన ఘటన గండీడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవార్వాల్ చెందిన చాకలి రాములు కుమారుడు సతీష్ (26) హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఉద్యోగాల కోసం ఎంత ప్రయత్నించినా రాలేదు. జనవరిలో సొంత గ్రామానికి వచ్చాడు. కుటుంబీకులతో తల్లిదండ్రులతో గడిపి జనవరి 19న మధ్యాహ్నం హైదరాబాద్ హాస్టల్‌కు వెళ్తున్నానని చెప్పాడు. తిరిగి ఈనెల 2న తన ఫోన్ ద్వారా అక్కకు మెసేజ్ చేశాడు. 'జీవితంపై విరక్తి చెందిందని, తాను వెళ్లిపోతున్నానని అమ్మానాన్నలకు భారం కాలేనని' తెలిపాడు. కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు.

పార్లమెంట్ టికెట్ ముదిరాజ్‌లకే ఇవ్వాలి



అధ్యక్షుడిని సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జడ్చర్ల టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం ముదిరాజ్‌లకే ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజకీయ పార్టీలను కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలుండగా రెండు ఎస్సీ, ఒక ఎస్టీలకు రిజర్వేషన్ కాగా మిగిలిన 14 స్థానాల్లో కనీసం నాలుగు స్థానాలు ముదిరాజ్‌లకు ఇవ్వాలన్నారు. వాటిలో మహబూబ్‌నగర్, మేడ్చల్, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలు ఇస్తే తాము గెలిపిస్తామన్నారు. లేదంటే అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం చూసినటువంటి పార్టీలలాగే ఫలితాలు వస్తాయని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముదిరాజులను బీసీ–డీ నుంచి ఏ గ్రూప్‌గా మారుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే జీఓ నెంబరు 15 అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాబన్న, రేణుక, కృష్ణయ్య, చెన్నయ్య, లక్ష్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



మైసమ్మ దేవత

నవాబుపేట: మండలంలోని మైసమ్మ దేవాలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. మైసమ్మ అడవి మొత్తం భక్తులతో నిండిపోయింది.

అన్ని రంగాల్లో రాణిద్దాం



మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మహమ్మదాబాద్: గిరిజన తండాల నుంచి విద్య, ఉద్యోగాల్లో ముందుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాదిద్దామని గోర్‌శిక్వాడి, గోర్ సేన అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లుగా ఉండి ఐదేళ్ల పాటు తండాలను అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు గీతాపాండు, నీలేష్, భామినిబాయి, సాలిబాయి, శంకర్‌నాయక్, బాలాజీ, రవిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రభు, సూర్య, రఘు, శాంతిబాయి, లక్ష్మి, మోహన్, దేవిజా, పాండు, లోక్య పాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: పదవులు లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటానని వెన్నాచేడ్ మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయనకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోపాల్, కమల, పులీందర్, శరణప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేదికపై శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువు తీరిన చెన్నకేశవస్వామికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పలువురు మహిళలు పుష్పాలతో అర్చన చేశారు. రెండు గంటల పాటు నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పూలతో నిండిన చెన్నకేశవస్వామి

ప్రజాపాలనలో భాగస్వాములు కావాలి



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో జిల్లా పరిషత్ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ సీఈఓ, డిప్యూటీ సీఈఓల సంక్షేమ సంఘం డైరీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ఎండగడుతాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రజల్లో ఎండగడుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ వైఫల్యాలపై చార్జిషీటుప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు ప్రకారం ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని రంగాల కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా కనీస వేతనం రూ.26వేలు అమలుపరచాలని, నాలుగు లేబర్ కోడ్‌లను విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని కోరారు. ముగిసిన షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలు జీవోలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2021లో విడుదల చేసిన కనీస వేతనాల జీవోలను వెంటనే గజిట్ చేసి అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ప్రైవేట్‌పరం చేయడం ఆపాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఎత్తివేయడంతో పాటు రైతులకు కనీస మద్దతు ధర అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రకాంత్, రాజ్‌కుమార్, భరత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు